క్లుప్తంగా

కరెంటు కష్టాలు..


చెడిపోయిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

నడికూడ : మండల కేంద్ర ప్రజలు కరెంటు కష్టాలతో సతమతమౌతున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కున్న బుషర్ పోవడంతో కొద్ది రోజులుగా నిరుపయోగంగా ఉంటోంది. మరో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్ లోడ్‌తో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇకనైనా అధికారులు స్పందించి సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తే పెరకవాడ, యాదవకాలనీ, తదితర ప్రాంతాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా సమస్య తమ దృష్టికి వచ్చిందని, మరో రెండ్రోజుల్లో పరిష్కరిస్తామని ఏఈ కె.విశ్వప్రసాద్ 'సాక్షి'కి వివరణ ఇచ్చారు.

ఖబరస్తాన్, ఈద్గాలకు ప్రహరీ నిర్మించాలి



శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ఖబరస్థాన్‌లకు, ఈద్గాలకు ప్రహరీలు నిర్మించాలని కోఆప్షన్ ఫోరం అధ్యక్షుడు మహమ్మద్ రాజమహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మోహిబొద్దీన్, బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా మైనార్టీ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ నయీముద్దీన్ కోరారు. ఈ మేరకు వారు హైదరాబాద్‌లో మైనార్టీ వెల్ఫేర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నైన్‌పాక మజీద్ సదర్ సాబ్, రాహ్మద్, హైదర్, అక్బర్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దామెర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేడు (గురువారం) మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం మొదలౌతుందని, ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేటినుంచి శిక్షణ

కమలాపూర్ : ఈనెల 16 నుంచి 18 వరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథక క్షేత్ర ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల గ్రామ దీపికలకు స్వచ్ఛభారత్ గ్రామీణ్-2, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పల్లవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంట్లోనూ మరుగుదొడ్ల, ఇంకుడుగుంతల, డ్రెయినేజీల నిర్వహణతోపాటు తడి, పొడిగా చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై రోజూ ఉదయం 10 నుంచి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 16, 18 తేదీల్లో మండల కేంద్రంలోని రైతు వేదికలో, 17న శంభునిపల్లిలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలకు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల గ్రామ దీపికలు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్-1 పేపర్ లీక్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే గ్రూప్-1 పేపర్ లీక్ అయ్యిందని బహుజన సంక్షేమ సంఘం (బీఎస్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకవడంతో పరీక్ష రాసిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏ పోటీ పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. గతంలో గ్రూప్-2 పేపర్‌లోనూ ఇలాగే జరిగిందని గుర్తు చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం తప్పిదం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని మండిపడ్డారు.

'లీకేజీ' బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : గ్రూప్-1 పరీక్షా పత్రం లీకేజీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీలో సమర్థత లేని వారిని సభ్యులుగా నియమించారని ధ్వజమెత్తారు. తక్షణమే సభ్యులను తొలగించి అర్హులతో భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగులతో చెలగాటమాడడం సరికాదని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో విద్యార్థుల, యువజన పోరాటాలు తప్పవని వెంకటనారాయణ హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలు షురూ

పరకాల, ఆత్మకూరు, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో ఇంటర్ పరీక్షలు బుధవారం మొదలయ్యాయి. తొలిరోజు తెలుగు, హిందీ ఉర్దూ పరీక్షలు జరిగాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరకాలలో సమయం ఎక్కువగా లేకపోవడంతో కంగారు పడుతున్న ఓ విద్యార్థిని సీఐ కిషన్ గుర్తించి కానిస్టేబుల్‌తో ద్విచక్ర వాహనంపై పంపించడంతో నిమిషం ముందు సదరు విద్యార్థి పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు.

–సాక్షి నెట్‌వర్క్


పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రం వద్ద బారులు దీరిన విద్యార్థులు


ఆత్మకూరు : పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న విద్యార్థులు


కమలాపూర్ : పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ఎల్కతుర్తి : మోడల్ స్కూల్‌లో..

అభివృద్ధి పనులు మంజూరు చేయండి

● మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ కడియం వినతి

ధర్మసాగర్ : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి పలు అంశాలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిబ్రవరి 27న వేలేరు మండలంలోని సోడషపల్లిలో కేటీఆర్ పాల్గొన్న సభలో పలు అభివృద్ధి పనులను కేటీఆర్‌కు వివరించినట్టు గుర్తు చేశారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం, నారాయణగిరి, పీచర, మద్దెలగూడెం, కొమ్ముగుట్ట, లింగంపల్లి, శ్రీపతిపల్లి మీదుగా తరిగొప్పుల వరకు సుమారు 35 కిలోమీటర్ల మేర డబుల్ బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు వేలేరు, చిల్పూర్ మండల కేంద్రాలలో మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, స్టేషన్ ఘన్‌పూర్‌లోని 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరణ, మున్సిపాలిటీగా ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కేటీఆర్‌ను శ్రీహరి కోరారు.


కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న కడియం

హనుమాన్ ఆలయ భూమిని రక్షించాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల వెనకాల ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన ఎకరం భూమిని రక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపెల్లి సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఆలయం వద్ద హనుమాన్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్లకంచెను పార్టీ శ్రేణులతో కలిసి సుభాష్ బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడారు. కొన్ని వేల ఏళ్ల క్రితం ఏర్పాటైన హనుమాన్ విగ్రహాన్ని పక్కకు జరిపే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆలయ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. సదరు ఎకరం భూమిలో త్వరలో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయంలో గ్రామస్థులు సహకరించాలని కోరారు. అనంతరం హనుమాన్ విగ్రహం వద్ద పూజలు చేసి కాషాయ జెండాను ఎగరేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గంకిడి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల సంపత్ కుమార్, మండల అధికార ప్రతినిధి శ్రీరాముల విజయ్‌కుమార్, ఐటీ సెల్ కన్వీనర్ దాసరి సదానందం, నాయకులు ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఎగరేస్తున్న సుభాష్, తదితరులు

పేద యువతి వివాహానికి రూ.10 వేల సాయం

● గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దాతృత్వం

దామెర : మండలంలోని ఓగ్లాపూర్ గ్రామానికి చెందిన నూనె లక్ష్మీ–కిషన్ దంపతుల కూతురు వివాహం కోసం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి బుధవారం రూ.10 వేలు సాయం అందించి దాతృత్వం చాటారు. గ్రామంలో ఆడశిశువుకు జన్మనిచ్చిన తల్లికి రూ.5 వేలు, పేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లికి పుస్తెమట్టెల కోసం రూ.10 వేలు సాయం అందిస్తానని ఆయన గతంలోనే ప్రకటించారు. ఈ మేరకు లక్ష్మీ–కిషన్ దంపతులను, పెళ్లికూతురును శ్రీధర్‌రెడ్డి బుధవారం కలిసి రూ.10 వేలు అందించారు. ఇచ్చిన మాట మేరకు పేదరాలి వివాహానికి సాయం అందించడంతో శ్రీధర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిపల్లి సరోజన, పంచాయతీ కార్యదర్శి మనోహర్, మహిళా సంఘాల సభ్యులు నల్ల సుజాత, దామెర రజిత, పర్వీన్, కారోబార్ కిన్నెర శ్రీనివాస్, దుర్శెట్టి చేరాలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నేడు ఆటోడ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం

హన్మకొండ: త్రినగరి ఆటోడ్రైవర్ల సమ్మేళనాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ ఎస్.రవీందర్ రెడ్డి, కల్పలత సూపర్ బజార్ చైర్మన్ వర్ధమాన్ జనార్దన్ తెలిపారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ఆర్థికాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు, ప్రమాద రహిత ప్రయాణం, ట్రాఫిక్ రూల్స్‌పై అధికారులు అవగాహనక కల్పిస్తారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, అతిథులుగా వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, డీసీపీ కె.పుష్ప, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ప్రజాస్వామిక పాలన చేయడం లేదని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ విమర్శించారు. అరాచక పాలన కొనసాగిస్తూ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. కాకతీయ యూనివర్సిటీ గేట్ వద్ద ఈనెల 25న నిర్వహించనున్న విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనకు ఉద్యమ కేంద్రాలుగా ఉన్న యూనివర్సిటీలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో సర్కారు విఫలమైందని అన్నారు. కేయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంచంద్రం మాట్లాడుతూ యూనివర్సిటీలకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయఖన్నా, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు, కేయూ ఎంఎస్‌ఎఫ్ ఇన్‌చార్జ్ వద్దెపెల్లి మధు, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, పలు సంఘాల బాధ్యులు చల్లా శ్రీనివాస్, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ మల్లేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఐనవోలు : మండలంలోని సింగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. హెచ్‌ఎంగా ఇ.ఇందు, ఉపాధ్యాయులుగా బి.సుమిత్, జాన్సన్, ఈ.రక్షిత, ఆఫీస్ సబార్డినేట్‌గా కె.సాత్విక్ వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభావంతులను ఉడుతగూడెం, నర్సింహులగూడెం హెచ్‌ఎంలు సీహెచ్.లింగారావు, డి.లక్ష్మీనారాయణ గుర్తించగా ముఖ్యఅతిథిగా స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రతిభావంతులుగా గుర్తింపు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాడెం వెంకటయ్య, ఎస్‌ఎంసీ సభ్యులు సింగారం ఏలియా పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మత్స్యగిరి స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల భిక్షపతి బుధవారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి 10 జీపీఏ సాధించాలని సూచించారు. పరీక్షల పట్ల ఆందోళన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోతె రాజ్‌కుమార్, ఏటీపీ కే.కవిత, సంతోష్, అభి పాషా, విజయలక్ష్మీ, చంద్రమౌళి, రాజు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

హసన్‌పర్తి: హసన్‌పర్తి శివారులోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీకాంత్ డాక్టరేట్ అందుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ ఈ అవార్డును ప్రదానం చేసింది. 'ప్రొసెస్డ్ రీసైకిల్ టూ వే సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ స్లాబ్' అనే అంశంపై ప్రొఫెసర్ వి.శేషగిరిరావు, డాక్టర్ దక్షిణామూర్తి పర్యవేక్షణలో పరిశోధక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను కిట్స్ కళాశాల సెక్రటరీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, సివిల్ విభాగాధిపతి ఎం.శ్రీకాంత్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అభినందించారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని విష్ణుపురి వెస్లీ పబ్లిక్ స్కూల్‌లో స్టూడెంట్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను కార్పొరేటర్ జక్కుల రవిందర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామనవమి నవరాత్రోత్సవ ఆహ్వాన పత్రికలను ఆలయ పాలక మండలి సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు జరగనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని భక్తులను పాలకమండలి సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, అనగం యాదగిరి, బెదరకోట రంజిత్‌కుమార్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామనవమి నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

● హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. ఈనెల 20న హుస్నాబాద్‌లో నిర్వహించనున్న ఐటీ మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి గార్డెన్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్య గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేటీఆర్ సభ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. మెట్ట ప్రాంతాలకు దేవాదుల నీటిని తెప్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. సమైక్య పాలనలో రైతుల ఆత్మహత్యలు ఉండేవని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అనంతరం మండలంలోని 18 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, 33 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. తొలుత జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 20న తలపెట్టిన కేటీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, తహశీల్దార్ గుజుల రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ తూర్పాటి సునీత, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బుర్గుల రామారావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, రైల్వే బోర్డు సభ్యుడు ఎల్తూరి స్వామి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ తంగెడ మహేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లె మహేందర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

కేంద్ర పథకాలను ప్రజలకు చేర్చండి

● బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

పరకాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాలని బీజేపీ శ్రేణులను ఆ పార్టీ ఆలేరు పాలక్, మాజీ స్థానిక ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కోరారు. పరకాల పట్టణంలోని లక్ష్మీ మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ పరకాల, నడికూడ మండలాల బూత్ స్వశక్తి కిరణ్ అభియాన్, భారత రాష్ట్రపతి ప్రసంగం వర్క్‌షాప్‌కు ఎమ్మెల్యే భిక్షపతి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని చెప్పారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యానారాయణరావు, భద్రాద్రి అసెంబ్లీ ప్రభారీ దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజభద్రయ్య, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, కొలనుపాక భద్రయ్య, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్, నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

హక్కుల వినియోగం ప్రజల బాధ్యత

పరకాల : హక్కులను వినియోగించుకోవడాన్ని ప్రజలు బాధ్యతగా భావించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ఆకాంక్షించారు., ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత మేధావులు, యువత మీదే ఉందని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన వినియోగదారుల హక్కుల దినోత్సవ సమావేశంలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడారు. వస్తువుల నాణ్యత, స్వచ్ఛత, ధరలకు సంబంధించి వినియోగదారులకు హక్కులు ఉన్నా అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.అనిల్‌కుమార్, సీహెచ్.సుస్మిత, డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ ఎల్.ఇందిరదేవి, డాక్టర్ వి.రాజయ్య, ఆర్.కుమారస్వామి, డాక్టర్ జి.ఓదేలు, అశోక్ మోరె, ఎం.రవికుమార్, పి.సుభాషిణి, దుప్పటి సంజయ్, జి.స్వప్న రఫీ, టి.రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

'మోసపూరిత బీజేపీపై పోరు తప్పదు'

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మీద పోరు తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని మండల కేంద్రంలో మండల కన్వీనర్ బొడ్డు శాంతిసాగర్ ఆధ్వర్యంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజుతో కలిసి దినేష్ బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 28 ఏళ్లుగా పోరాడుతున్నట్టు తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పార్లమెంటులో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పిస్తామని ప్రధాన మంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ హైదరాబాద్‌కు వచ్చి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణకు మాట ఇచ్చి మద్దతు కోరారని గుర్తు చేశారు. ఓట్లు దండుకుని గద్దెనెక్కి 9 ఏళ్లుగా మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ, ఏప్రిల్ 4న తలపెట్టిన హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్, నాయకులు గద్దల సుకుమార్, చింత శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు, సురుగూరి కమలాకర్, ఆకునూరి రమాదేవి, పుట్ట ప్రశాంత్, నక్క సుమన్, మాచర్ల బాబు, బొందుగుల నరేష్ పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దినేష్, తదితరులు

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

దామెర : కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. మండలంలోని సింగరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. శిబిరాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, మెడికల్ ఆఫీసర్ సుధీర్, పంచాయతీ కార్యదర్శి రజిత, హెచ్ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్‌ఎం స్వరూప, శ్రీధర్, బాబు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శంకర్

మోడల్ శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి

ఖిలా వరంగల్: మోడల్ శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు తెలిపారు. వరంగల్ 17వ డివిజన్‌లోని స్తంభంపెల్లి, వసంతాపురం గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న మోడల్ శ్మశాన వాటిక పనులను ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. విలీన గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, మహిళా భవన నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.